క్లుప్తంగా

జాతరకు రండి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న నాగప్ప

తాండూరు రూరల్: మండలంలోని గౌతపూర్ గ్రామంలో జరిగే శ్రీ మల్లిఖార్జునస్వామి జాతరకు రావాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప ఆహ్వానించారు. బుధవారం తాండూరులో ఎమ్మెల్యేని కలిసి జాతర కరపత్రం అందజేశారు. డిసెంబర్ 30 నుంచి జనవరి 01 వరకు గ్రామంలో జాతర జరగనుందని నాగప్ప తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

జెడ్పీటీసీ హరిప్రియ



పూజల్లో పాల్గొన్న జెడ్పీటీసీ, మున్సిపల్ చైర్మన్

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీటీసీ హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కాళ్లాపూర్ గ్రామంలోని లొంక ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. లొంకక్షేత్రం ఎంతో మహిమానితమైందన్నారు. భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. ముఖ్యంగా యువత భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంగయ్య, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో స్వామివారిని దర్శించుకుంటున్న నేతలు

దోమ: మండలంలోని దిర్సంపల్లిలో బుధవారం అయ్యప్ప మహా పడిపూజను స్వాములు నిర్వహించారు. గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ్ గౌడ్ నివాసంలో గురుస్వాముల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా పడిపూజ అంగరంగా వైభవంగా జరిగింది. అయ్యప్ప స్వామి నామస్మరణతో దిర్సంపల్లి గ్రామం మార్మోగింది. ఆయా గ్రామాల అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని భజన పాటలు, భక్తీ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధి రాములుగౌడ్, గ్రామస్తులు రమేశ్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, అఖిల్, రఘు, అబ్దుల్లా తదితరులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అంబేడ్కర్ జీవితంపై నాటక ప్రదర్శన

యాలాల: రాజ్యాంగ రచయిత డాక్టర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై రేపు(శుక్రవారం) నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీరానందం తెలిపారు. అభ్యుదయ కళాజాత బృందం సభ్యుల ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. తాండూరు పట్టణంలోని గగరాణి గార్డెన్స్‌లో నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

నేవీ రాడార్ కేంద్ర ఏర్పాటును అడ్డుకుందాం

పూడూరు: అటవీశాఖ నుంచి దామగుండం రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని కాపాడుకుందామని ఆలయ పరిరక్షణ కమిటీ సభ్యులు తీర్మానించారు. బుధవారం పూడూరు కేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నవ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ పటేల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎంతో పురాతనమైన రామలింగేశ్వర ఆలయాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఎంతో ప్రశాంతమైన ఈ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటు చేసి వాతావరణ కాలుష్యంతో పాటు జీవరాశుల మనుగడకు దెబ్బతీయొద్దన్నారు. ఆలయాన్ని కాపాడుకుందామని గ్రామసభలో తీర్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేందర్, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, సత్యానందస్వామి, నాయకులు , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానం

బషీరాబాద్: దామర్‌చెడ్ భవానీమాత ఆలయ పీఠాధిపతి శ్రీ శంకర్ స్వామిజీకి అరుదైన గౌరవం లభించింది. వచ్చే ఏడాది జనవరి 22న ప్రధాని నరేంద్ర మోడీ చేతులు మీదుగా ప్రారంభం కానున్న కార్యక్రమానికి హాజరు కావాలని శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్రం సెక్రటరీ జనరల్ చంపత్ రాయ్ తనకు ఆహ్వానం పంపించారని బుధవారం ఒక ప్రకటనలో వారు పేర్కొన్నారు.

పారదర్శకంగా ప్రజాపాలన

- ప్రతి ఇంటికి దరఖాస్తు ఫారాలను అందిస్తాం
- మీ సేవ కేంద్రాలు, జిరాక్స్ సెంటర్లకు వెళ్లొద్దు
- వంద రోజుల్లో గ్యారంటీల అమలు
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



తాండూరు: సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



పరిగి: అధికారులకు సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్

తాండూరు: ఆరు గ్యారంటీ స్కీంలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు ఆర్డీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రజాపాలన కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలను సమావేశంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన రోజే గ్యారంటీ స్కీమ్‌లకు సంబంధించి తొలి సంతకం చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీ స్కీమ్‌లను 100 రోజుల్లో లబ్ధిదారులకు అందించేందుకు ప్రణాళిక తయారు చేయడం జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వంలో పథకాల కోసం లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అధికార యంత్రాంగం ప్రతి ఇంటికి దరఖాస్తు ఫారాలను ఉచితంగా అందిస్తుందన్నారు. లబ్ధిదారుల వద్ద రేషన్ కార్డు, ఆధార్‌కార్డులు లేకున్న దరఖాస్తు చేసుకోనే వెసులుబాటు ఉందన్నారు. ప్రతి మండలానికి ప్రత్యేకాధికారులను నియమించడం జరిగిందన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని ప్రజలకు వినిపించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శేకర్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండస్వప్నపరిమళ్, వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీపనర్సింహులు, ప్రత్యేకాధికారులు చక్రపాణి, వినయ్‌కుమార్, లలితకుమారి, పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్,బషీరాబాద్ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తాండూరు మండల ఎంపీపీ అనితరవిగౌడ్, పెద్దేముల్ వైస్ ఎంపీపీ మధులత, డీసీసీబీ డైరక్టర్‌లు చైర్మన్ లక్ష్మారెడ్డి,రవిగౌడ్ నాయకులు ఉన్నారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి

కొడంగల్ : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించాలని కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని మూడు మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులతో జిల్లాస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యులు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు కోసం దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 12 వార్డులు, కొడంగల్ మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీలు, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో అధికారులు, సిబ్బంది పర్యటించి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నియోజకవర్గం ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి కలుగజేసుకొని రాజకీయాలు ఏమైనా ఉంటే సమావేశం బయట చూసుకోవాలని సభలో వద్దని సర్దిచెప్పారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులతో పాటు తహసీల్దార్లు విజయకుమార్, వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ పాండు తదితరులు పాల్గొన్నారు.

జనవరి 6 వరకు దరఖాస్తులు

ధారూరు: నేటి నుంచి (గురువారం)నుంచి జనవరి 6వ తేదీ వరకు ధారూరు మండలంలో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆయా గ్రామ పంచాయతీల పరిదిలో గ్రామసభలు నిర్వహించి ప్రజాపాలన దరఖాస్తులను ప్రజానీకం నుంచి స్వీకరించనున్నారు. 28 నుంచి రాజాపూర్, మోమిన్‌ఖుర్దు, నర్సాపూర్, గడ్డమీది గంగారం జీపీల్లో 29న గురుదోట్ల, అంపల్లి, రాంపూర్‌తండా, గట్టెపల్లి జీపీల్లో, 30న అల్లాపూర్, నాగసముందర్, అవుసు˘ఎల్లి, ధారూరు జీపీల్లో, జనవరి 2వ తేదీన పీసీఎం తండా, నాగారం, అల్లిపూర్, కేరెళ్లి జీపీల్లో, 3న స్టేషన్‌ధారూరు, దోర్నాల్, అంతారం, మోమిన్‌కలాన్, 4న తరిగోపుల, నాగ్‌సాన్‌పల్లి, ఎబ్బనూర్, మున్నూరుసోమారం, 5న మైలారం, కుమ్మర్‌పల్లి, చింతకుంట, హరిదాస్‌పల్లి, 6న కొండాపూర్‌కలాన్, ధర్మాపూర్, కుక్కింద, రుద్రారం గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనున్నారు.

నేటి నుంచి గ్రామసభలు

మోమిన్‌పేట: నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శైలజారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం పేరిట ఆరు గ్యారంటీలకు ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తును స్వీకరించనున్నామని ఆమె పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌తో పాటు ఒక ఫొటోను జతచేయాలని ఆమె సూచించారు. మండలంలోని 28గ్రామ పంచాయతీల్లో రెండు టీంలు కలిసి రోజుకు 4గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ఒక్కో టీంలో టీం లీడర్‌తో కలిసి 6 మంది అధికారులు ఉంటారని ఆమె తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మొదటి టీంలో ఎంపీడీఓ శైలజారెడ్డి, రెండవ టీంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తిలు ఉంటారు. అధికారులకు సహకరించాలని ఆమె కోరారు.

పక్కాగా అమలు చేయాలి

పూడూరు: ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల పథకాలను పక్కాగా అమలు చేయాలని మండల ప్రత్యేక అధికారిణి సుధారాణి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీపీ మల్లేశం అధ్యక్షతన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని ప్రతి గ్రామానికి ప్రత్యేక అధికారులను నియమించామని ఒక రోజు ముందే లబ్ధిదారులకు దరఖాస్తు పత్రాలను ఇవ్వాలని సూచించారు. గ్రామంలో తప్పనిసరిగా టాంటాం వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మైపాల్ రెడ్డి, జెడ్పీటీసీ మేఘమాల, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ ఉమాదేవి పాల్గొన్నారు.

గ్రామాల వారీగా షెడ్యూల్ విడుదల

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం కానుందని తహసీల్దార్ తారాసింగ్,ఎంపీడీఓ సుదర్శన్ రెడ్డిలు పేర్కొన్నారు. నేడు గురువారం చింతమణిపట్నం, పర్వాతపూర్ , చిట్టిఘనాపూర్, చంద్రవంచ, వీరారెడ్డిపల్లి, రాంపూర్‌మీది తండా, 29న గుంతబాసుపల్లి,మిట్టబాసుపల్లి నారాయణపూర్, వీర్‌శెట్టిపల్లి, ఖాంజాపూర్, అంతారం తండా, 30న గౌతపూర్, అల్లాపూర్ ,చెంగోల్ ,సంకి రెడ్డిపల్లి, అంతారం,బిజ్వార్, జనవరి 2న బెల్కటూర్ ,ఓగిపూర్,కరన్‌కోట్, 3న సంగెంకలాన్ ,మల్కాపూర్ ,కోటబాసుపల్లి,కోత్లాపూర్, 4న చెన్‌గేస్‌పూర్, గోనూర్ ,జినుగుర్తి,ఐనెల్లి, 5న ఉద్దాండపూర్ ,గుండ్లమడుగుతండా, ఎల్మకన్నె, సిరిగిరిపేట్ గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నలుగురు టీం లీడర్లు, 47జీపీల్లో సభలు

బొంరాస్‌పేట: ప్రభుత్వం అందించనున్న ప్రజాపాలన(అభయహస్తం) కార్యక్రమాలు గ్రామాలవారీగా నేటి నుంచి నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధమైంది. 47 గ్రామపంచాయతీల్లో మండలంలో తహసీల్దార్ వెంకటేశ్, దుద్యాల తహసీల్దార్ దానయ్య, ఎంపీడీఓ వెంకన్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ రవిలు టీమ్‌లీడర్లుగా ఉంటున్నారు. దరఖాస్తుల స్వీకరణకు కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న ప్రజాపాలన కార్యక్రమంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు గ్యారంటీ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

విజయవంతం చేయాలి

బొంరాస్‌పేట: ప్రజాపాలన కార్యక్రమాలను గ్రామాలవారీగా విజయవంతం చేయాలని ప్రత్యేకాధికారి (ల్యాండ్ రికార్డు విభాగం ఏడీ) రాంరెడ్డి సూచించారు. బుధవారం మండల కార్యాలయంలో ప్రజాపాలన నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక వివరించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గురువారం నుంచి 47 గ్రామపంచాయతీల్లో మండలంలో టీంలీడర్లుగా తహసీల్దారు వెంకటేశ్, దుద్యాల తహసీల్దార్ దానయ్య, ఎంపీడీఓ వెంకన్నగౌడ్, డిప్యూటీ తహసీల్దారు రవిలు ఉంటున్నారని, ఒక్కో బృందానికి నలుగురు చొప్పున 16 టీం సభ్యులుగా, సహకారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు ఉంటున్నారని తెలిపారు.

పకడ్బందీగా నిర్వహించాలి

పరిగి: ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి జనవరి 6వ తేది వరకు ప్రతి వార్డులో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వార్డుల వారీగా అధికారులను కేటాయించామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ అందేలా చర్యలు

దోమ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకొని, ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించాలని ఎంపీపీ అనసూయ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వైస్ ఎంపీపీ మల్లేశంతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజలకు అందించేందుకు నేటి నుంచి గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించాలన్నారు. అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేయాలన్నారు. ప్రతి రోజు గ్రామస్థాయిలో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో రెండు గ్రామసభలను నిర్వహించి ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ సోమలింగం, ఎంఈఓ హరిశ్చందర్, ఏఓ ప్రభాకర్ రావు, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

కొడంగల్ రూరల్ : ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాలులో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా అధికారులు, నాయకులు పని చేయాలని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.విజయకుమార్, ఎంపీడీఓ పాండు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దఖాస్తులు స్వీకరించాలి

మోమిన్‌పేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయ హస్తం కింద లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఎంపీడీఓ శైలజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. దరఖాస్తు ఫారంలో పేర్కొన్నట్లు కుటుంబ యాజమాని పూర్తి వివరాలు అందించాలన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు లబ్ధిదారులకు నుంచి దరఖాస్తులను తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీఓ యాదగిరి, ఎఓ జయ శంకర్, ఎఈఈలు ప్రణీత్, నయనశ్రీ, ఆర్ఐ రాజు, ఎపీఎం రాజు, ఏపీఓ శంకర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: మాట్లాడుతున్న అధికారులు



కొడంగల్ : వాగ్వాదం చేసుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యులు



మోమిన్‌పేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శైలజారెడ్డి

యాచకులకు దుప్పట్ల పంపిణీ

కొడంగల్ రూరల్ : పట్టణంలోని రహదారి పక్కన ఉండే పలువురు యాచకులకు బుధవారం మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం.గౌసన్ దుప్పట్లు అందజేశారు. చలి తీవ్రత పెరుగుతోందని, ఎలాంటి ఆధారంలేని నిస్సహాయులు చలికి తట్టుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారనే ఉద్దేశంతో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సయ్యద్ వహేద్ రజ, ఎంఏ.రహీమ్, సయ్యద్ ఖలేద్, గులాం అమర్ పాషా, సయ్యద్ అశ్వక్‌లున్నారు.



యాచకులకు దుప్పట్లు అందజేస్తున్న గౌసన్

నిర్మాణం చేపడితే అడ్డుకుంటాం

జీపీఏ హోల్డర్ నయీమ్ ఖాన్

తాండూరు టౌన్ : పట్టణంలోని సర్వే నంబర్ 52లో విద్యుత్ శాఖాధికారులు అక్రమ నిర్మాణం చేపడితే అడ్డుకుంటామని జీపీఏ హోల్డర్ నయీమ్‌ఖాన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఈ స్థలంలో విద్యుత్ అధికారులు నిర్మాణం చేపట్టడం సమంజసం కాదన్నారు. పట్టణంలోని మల్‌రెడ్డిపల్లికి చెందిన సర్వే నంబర్ 52లో గల 6 ఎకరాల 5 గుంటల స్థలంలోని 3ఎకరాల 5 గుంటల స్థలంలో అధికారులు నిర్మాణం చేపడుతున్నారని, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై పరువు నష్టం దావా వేశామన్నారు. కోర్టు తీర్పుకు తాము కట్టుబడి ఉంటామని, అప్పటి వరకు అక్కడ ఎలాంటి నిర్మాణం చేపట్టరాదని, కాదని చేపడితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి

ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: క్రీడాకారుల లక్ష్యం ఉన్నతంగా ఉండాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్– 14,16 విభాగంలో నిర్వహించిన జిల్లాస్థాయి సెలక్షన్స్ సందర్భంగా విజేతలైన క్రీడాకారులకు ఎమ్మెల్యే బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టిలో మాణిక్యాలు దాగి ఉంటాయనే నానుడి ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో సైతం విద్య, క్రీడా పలు రంగాల్లో నిష్ణాతులైన యువత వెలుగులోకి వస్తారన్నారు.వారికి సరైన తర్ఫీదునిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతారని తెలిపారు. అనంతరం అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎంపిక ప్రక్రియలో సెలక్ట్ అయిన క్రీడాకారులకు ఫిబ్రవరిలో జరగనున్న నేషనల్ గేమ్స్‌కి నేరుగా ఎంట్రీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పెద్దేముల్ జెడ్పీటీసీ సభ్యులు ధారాసింగ్, నాయకులు బాల్‌రెడ్డి, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు, సెక్రటరీ రాములు, వ్యాయామ ఉపాధ్యాయులు ల్గొన్నారు.

చేనేత హస్తకళలను ఆదరించాలి

తాండూరు టౌన్ : చేనేత హస్తకళలను ప్రజలు ఆదరించాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మంటడంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ ప్రదర్శన, విక్రయశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేతి వృత్తుల వారిని ఆదరించినట్లైతే వారికి గొప్ప ఉపాధిని కల్పించిన వారవుతారన్నారు. స్వయంగా ఎలాంటి మిషన్లు ఉపయోగించకుండా స్వహస్తాలతో తయారు చేసిన వస్తువులు ఎంతో మన్నికగా, ఆకర్షణీయంగా ఉంటాయన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

రేపు జాబ్ మేళా

వికారాబాద్ అర్బన్: సురక్షిత సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో సెక్యూరిటీ సిబ్బంది, ఎస్కార్ట్ సిబ్బంది ఉద్యోగాల కోసం 29న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉ. 10:30 గంటలకు జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం వద్ద ఆసక్తిగల అభ్యర్థులు హాజరు కావాలన్నారు. పురుషులకు మాత్రమే ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి నుంచి ఆ పై చదివిన వారు అర్హులని, 18 నుండి 35 ఏళ్లలోపు ఉండాలన్నారు. వివరాలకు 9676047444ను సంప్రదించాలన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు భద్రత కల్పించాలి

యాలాల: కాంట్రాక్టు పద్ధతిలో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. బుధవారం యాలాల మండల పరిషత్ సర్వసమావేశానికి హాజరైన ఆయనకు కాంట్రాక్టు ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు పద్ధతిలో సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కేజీబీవీ సీఆర్‌టీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, పీజీసీఆర్టీలు, పీఈటీ, ఏఎన్ఎం, అకౌంటెంట్, క్రాఫ్ట్ టీచర్, వాచ్ ఉమెన్, స్కావెంజర్, కుక్స్ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరందరికి ఉద్యోగ భద్రతలో భాగంగా కనీస వేతన స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రైతుబంధు, రుణమాఫీ అమలు చేయాలని వినతి

కొడంగల్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, రైతుబంధు పథకాలను వెంటనే అమలు చేయాలని రైతు జేఏసీ నాయకులు బుధవారం వ్యవసాయశాఖ ఏడీ శంకర్ రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. యాసంగి పంటల సాగుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం అందిస్తామన్న రైతుబంధు, రుణమాఫీ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఇందులో రైతు జేఏసీ నాయకులు వెంకటయ్య, దుద్యాల మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, రైతులు మల్కప్ప, మహిళా మోర్చా నాయకురాలు సుమిత్రమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.

దుద్యాల మండలాన్ని జిల్లాలోనే ఉంచాలి

కొడంగల్ రూరల్ : దుద్యాల మండలాన్ని వికారాబాద్ జిల్లాలోనే కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి దుద్యాల నిరుద్యోగ యువకులు బుధవారం వినతి పత్రం ఇచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కలపడం వల్ల జోగులాంబ, గద్వాల పరిధిలోకి వెళ్తుందని, దీంతో ఉద్యోగ అవకాశం లేకుండా పోతుందని వినతిలో పేర్కొన్నారు. విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి తెలిపారు.కార్యక్రమంలో నిరుద్యోగ యువకులు రాము, నవేందర్, మోహన్, రాజు, మణికంఠ, శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నిరుద్యోగ యువకులు

సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ

అనంతగిరి: క్షేత్రస్థాయిలో అధికారులంతా సమన్వయంతో పనిచేసి ప్రజాపాలనను విజయవంతం చేయాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణి అన్నారు. ఈమేరకు బుధవారం వికారాబాద్ ఎంపీడీఓ కార్యాలయం సమావేశం హాల్‌లో ప్రజాపాలనపై ఎంపీపీ చంద్రకళ అధ్యక్షతన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాపాలన నిర్వహణపై ప్రభుత్వ సూచనలు సలహాలు పాటించాలన్నారు. ప్రజాపాలన బృందాలు సమయపాలన పాటించాలన్నారు. సంబంధించిన ఏర్పాట్లన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యంపీపీ చంద్రకళ, యంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, కోఆప్షన్ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం

అనంతగిరి: వీఆర్ఏ నుంచి ప్రమోషన్ పొందిన తమకు ఎంప్లాయిస్ ఐడీ, వేతనాలు రాక 5నెలల నుంచి రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని పలువురు పూర్వ వీఆర్ఏలు వాపోయారు. బుధవారం వారు జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రమోషన్‌లు పొంది దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నామన్నారు. వేతనాలు లేక తీవ్ర మనోవేదన చెందుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించి వేతనాలు, ఐడీ కార్డులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు పూర్వ వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

ముందస్తు ఏర్పాట్లు చేయాలి

మర్పల్లి: నేటి నుంచి గ్రామాల్లో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎల్‌పీఓ, మండల ప్రత్యేకాధికారి అనిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పలువురు అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..షెడ్యూల్ ప్రకారం అన్ని గ్రామాల్లో దరఖాస్తులు తీసుకోవాలన్నారు. సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ గణేష్, యంపీడీఓ రాజమల్లయ్య, ఏపీఓ అంజిరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.